పంటకు బీమా.. రైతన్నకు ధీమా

- ప్రభుత్వ ప్రకటనతో అన్నదాతల ఆనందం



సుల్తానాబాద్: ఈదురు గాలులు, వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయి. పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని పక్కగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సాంకేతికత ఆధారంగా పంటల దిగుబడి అంచనా, రూపకల్పన, నష్టపోయిన పంట విషయంలో బీమా కంపెనీలు అందించేలా విధివిధానాలను రూపొందించనున్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుములు, సోయాబీన్, వేరుశనగ, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్‌పామ్, టమాటా, బత్తాయి పంటలకు బీమా వర్తించనుంది.

రైతులకు ప్రయోజనం

జిల్లాలో లక్షకు పైగా మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలో 267 గ్రామ పంచాయతీలు, రామగుండం కార్పొరేషన్‌తోపాటు సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలున్నాయి. ఈ ప్రాంతం ఎక్కువగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయం చేసి జీవనోపాధి పొందేవారే అధికం. అకాల వర్షాలు, ఈదురు గాలులకు నష్టం వాటిల్లిన రైతులను ఆదుకునేందుకు పంటలకు బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1,61,032 మంది రైతులు

జిల్లావ్యాప్తంగా 2,16,595 ఎకరాలుండగా.. 1,61,032 మంది రైతులున్నారు. సాగు సమయంలోనే రైతులు బీమా చేసుకుంటే పంట నష్టపోతే ప్రయోజనం కలగనుంది. గతంలో బీమా కింద ఎకరాకు వరికి రూ.37,484, పత్తికి రూ.36,282, మొక్కజొన్నకు రూ.18,743 పరిహారం వచ్చేది.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం రైతు బీమా సౌకర్యాన్ని ప్రవేశపెట్టాలని ముందుకు రావడం స్వాగతిస్తున్నాం. ఈదురు గాలులు, వర్షానికి వేసిన పంటలు దెబ్బతింటున్నాయి. ప్రతి ఏడాది ఏదో సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– పదాల అజయ్‌గౌడ్, రైతు, గర్రెపల్లి

ఆదేశాలు రాగానే అమలు



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం. వ్యవసాయం చేసి జీవనోపాధి పొందుతున్న రైతులు నష్టపోకుండా ఉండేందుకు మేలు జరుగుతుంది. రైతులు సైతం ప్రభుత్వం నిర్ణయించిన బీమా చెల్లిస్తే మరింత మంచిది. బీమా చెల్లిస్తే పంట నష్టపోయినప్పుడు వారికి నష్టపరిహారాన్ని బీమా కంపెనీ భరిస్తుంది.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

కాల్వశ్రీరాంపూర్: మల్యాల మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు గంటల ప్రాతిపదికన బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలని ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ గణితం, పీజీటీ తెలుగు, పీజీటీ ఇంగ్లిష్ టీచర్లు కావాలని, ఆయా సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తోపాటు బీఈడీ తప్పనిసరని, అర్హులైనవారు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21న డెమో క్లాసులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

4వతరగతిలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ఎలిగేడు: తెలంగాణ ప్రభుత్వ క్రీడాపాఠశాలలైన హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి కలెక్టర్ ఆదేశాల మేరకు 4వతరగతిలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక పోటీలు మండలస్థాయిలో ఈనెల 18న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నరేంద్రచారి తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, సెటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు నిర్వహిస్తామన్నారు.

సన్మానం



ఎస్సై సత్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

ఎలిగేడు: మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్టేషన్‌లో మొదటి ఎస్సైగా వచ్చిన సత్యనారాయణను సోమవారం నానేస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎలిగేడు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన యాకన్నను సత్కరించారు. నానేస్తం ట్రస్టు వైస్ చైర్మన్ తానిపర్తి సుధాకర్‌రావు, మల్లారెడ్డి, వీరస్వామిగౌడ్, శ్రీశైలం, రమేశ్, డిల్లేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, అశోక్, ఎండీ ఖలీల్, కల్లెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



కోల్‌సిటీ: గోదావరిఖనిలో సోమవారం ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ దగ్గర పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే తీరు, వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైనంతోపాటు పాటించాల్సిన పద్ధతులపై వివరించారు.

ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి ఉద్దండ నవీన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కోనరావుపేటకు చెందిన బోడ రజిత, సురేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా దాసుపల్లి గ్రామానికి చెందిన భక్తులు చీమర్ల సుస్మిత, నరేందర్‌రెడ్డి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు.

భగవద్గీత ప్రచారం

పాలకుర్తి: కుక్కలగూడూర్ గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక లక్ష్మెట్టిపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. భగవాన్ శ్రీకృష్ణుడిని జగద్గురువుగా ఎందుకు పూజించాలి, అతడి గొప్పతనం ఏమిటి తదితర విషయాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

దుద్దిళ్ల శ్రీనుబాబుకు ఘన స్వాగతం

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దుద్దిళ్ల శ్రీనుబాబు మొదటిసారి మంథని నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా సోమవారం కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, జక్కుల దామోదర్‌రావు కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఘనంగా స్వాగతం పలికారు.

ఇంజినీరింగ్ అధికారుల సర్వే

కాల్వశ్రీరాంపూర్: మంగపేట గ్రామంలో హుసేన్‌మియా వాగుపై లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశాల మేరకు సోమవారం ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేశారు. హుసేన్‌మియా వాగు నుంచి నీటిని లిఫ్టు ద్వారా రైతుల సాగు భూముకు సాగు నీరందించాలని రైతుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ రైతులతో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యాసామగ్రి అందిస్తున్న ఎంఈవో మహేశ్‌కుమార్, ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఎఫ్ఎల్ఎన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. అంకంపల్లి గ్రామంలో విద్యార్థులకు ఉచిత యూనిఫాం దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు, షూస్, టైలు, విద్యాసామగ్రి అందించారు. మాజీ సర్పంచ్ చిరంజీవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు సునీత, కోటేశ్వర్‌రావు, హెచ్ఎంలు రాజారాం, కర్నె రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ 39వ డివిజన్ మాతంగికాలనీలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యకర్తలు స్వప్న, పద్మ, సుజాత, ఆర్పీలు స్వప్న, లత, పోషకులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయుష్ డాక్టర్ నిహారిక నేతృత్వంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో యోగా సాధన చేయించారు. డాక్టర్ నిహారిక మాట్లాడుతూ.. యోగా చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు ఫిట్‌నెస్‌తో జీవించొచ్చన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, పీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, హెచ్ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎం సరోజన, ఆశ కార్యకర్తలు మౌనిక, శారద, సరోజన, భూలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 17న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీలో నాయకులతో కలిసి ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగుతున్న హత్యాకాండను వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకరమ్మ, దుర్గేశ్, బాబు, నరేశ్, రాజయ్య, సమ్మయ్య, సుభద్ర, అరవింద్, శారద, లక్ష్మి, అనసూయ, పద్మ, శ్రీను, సంజీవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు స్పందన



జూలపల్లి: అబ్బాపూర్‌లో ముఖ్యమంత్రి ప్రసంగం వింటున్న రైతులు

జూలపల్లి: తెలుకుంట, అబ్బాపూర్, వడ్కాపూర్ రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో ప్రసంగానికి రైతులు భారీగా హాజరయ్యారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎలిగేడు, లాలపల్లి, నారాయణపల్లి, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి, ధూళికట్ట రైతు వేదికలో ధూళికట్ట, ముప్పిరితోట, లోకపేట, సుల్తాన్‌పూర్ రైతు వేదికలో సుల్తాన్‌పూర్, శివపల్లి, బుర్హాన్‌మియాపేట, నర్సాపూర్ గ్రామాల రైతులు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

మంథని రూరల్: ఎగ్లాస్‌పూర్, గుంజపడుగు, సూరయ్యపల్లి గ్రామాల్లోని రైతు వేదికలకు వీసీలను అనుసంధానం చేయగా.. ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని వినిపించారు.

ముత్తారం: ఖమ్మంపల్లి, మైదంబండ, ముత్తారంలో రైతు వేదికలో ముఖ్యమంత్రి దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాలకుర్తి: పాలకుర్తి, పుట్నూర్, కుక్కలగూడుర్ గ్రామాల రైతు వేదికల్లో రైతు నేస్తం ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించారు.

జ్యోతినగర్: మేడిపల్లి గ్రామంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



ఓదెల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులివ్వడాన్ని నిరసిస్తూ ఓదెలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎలాంటి అవినీతి లేకున్నా విచారించడం చట్టవ్యతిరేకమన్నారు. పోలోజు రమేశ్, సురేశ్, మద్దెల శ్రీనివాస్, పిట్టల అరుణ్‌కుమార్, జీల రాజు, వినయ్, కొండ్ర రవి పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

సుల్తానాబాద్: ఈనెల 18న జరగనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జేఏసీ కోచైర్మన్ దుర్గం విశ్వనాథ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ట్రాన్స్‌కో జేన్‌కో ఎన్‌పీడీసీఎల్, విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సమస్య పరిష్కారానికి ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రమశిక్షణతో చదవాలి

ధర్మారం: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎస్సై శీలం లక్ష్మణ్ అన్నారు. నర్సింహులపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9వతరగతి చదువుతున్న మల్లె వెంకట సుప్రజ రాసిన అనుబంధాలు కవితా పుస్తకాన్ని ఎస్సై అవిష్కరించారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేత

ధర్మారం: పైడిచింతలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు టై, బెల్టులు అందజేశారు. అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ప్రధానోపాధ్యాయుడు గంగారెడ్డిని క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రియ

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ధనుశ్, మణికంఠ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సత్యం తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. శనివారం గోదావరిఖనిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 15, 17 సంవత్సరాల బాలుర బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలందుకున్న టి.ధనుశ్, బి.మణికంఠ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సత్యం తెలిపారు.

రక్తదాతకు అవార్డు



అవార్డు అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జ్యోతినగర్: ఎక్కువసార్లు రక్తదానం చేసినవారికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ గణితం బోధిస్తున్న పెరకారి శ్రీధర్‌రావు తన జన్మదినం పురస్కరించుకొని 20 సంవత్సరాలుగా 22సార్లు రక్తదానం చేయడంతో అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సాదుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎర్రబాటి వెంకటేశ్వరరావు, ఇతర బ్లడ్ డోనర్లు 13 మంది పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడిగా బానయ్య

మంథని: మంథనిలోని ఫ్రెండ్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీపతి బానయ్య, ఉపాధ్యక్షుడిగా మందల సత్యనారాయణ, కార్యదర్శిగా సువర్ణ గణపతి, సంయుక్త కార్యదర్శులుగా కొమరోజు శ్రీనివాస్(క్రీడలు), మల్క గోపాల్‌రావు(సాంస్కృతిక), కోశాధికారిగా బిరుదు మధుసూదన్, సభ్యులుగా రావికంటి సతీశ్, మెండే రాజయ్య, నరెడ్ల శ్రీనివాస్, ఆకుల రాజబాపు, గట్టు శివశంకర్ ఎన్నికయ్యారు.

గోదావరిఖనిటౌన్: నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ శ్రీకారం ప్రెసిడెంట్‌గా పోగుల వకుళ, సెక్రటరీగా ఆడెపు ఉష, ట్రెజరర్‌గా సీహెచ్ మంజుల సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హైదరాబాద్‌లో పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ డెవలప్మెంట్, క్రీడలు, యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పాలకుర్తి: బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలం మలుపు నుంచి బసంత్‌నగర్, పాలకుర్తి మీదుగా ఈసాలతక్కళ్లపల్లి గ్రామ శివారు వరకు సాగు నీరందించే ఎస్సారెస్పీ డి–83 ఉప కాలువ అయిన 1–ఎల్ కాలువలో పూడికతీత పనులను కొద్ది రోజులుగా స్థానిక ఉపాధిహామీ కూలీలు నిర్వహిస్తున్నారు. కాలువలో నుంచి తీసిన మట్టిని కాలువ ఒడ్డుకు కుప్పలుగా పోస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో కురిసే వానలకు ఒడ్డునున్న మట్టి తిరిగి కాలువలోకి పడే అవకాశాలున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి మట్టిని ఎత్తివేసే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

భారీ యంత్రాలతో ఉత్పత్తి లక్ష్యాలు పెంచాలి



షావల్ ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకొని ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. సోమవారం ఓసీపీ–3లో 75టన్నుల హైడ్రాలిక్ క్రేన్‌కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. రూ.4.41కోట్ల వ్యయంతో కొనుగోలు ఈ యంత్రాన్ని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రేన్ ద్వారా నిర్వహణ పనులు మరింత వేగంగా, సురక్షితంగా పూర్తి చేయొచ్చని అన్నారు. ఎస్‌ఓటూ జీఎం రాముడు, ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, గని మేనేజర్ భారత్‌కుమార్, సేఫ్టీ అధికారి పాపయ్య, బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జి జనార్దన్, కాలరీ ఇంజినీర్ వెంకట్‌రావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్, సంక్షేమాధికారి అజీజ్, ప్రాజెక్టు సెక్రటరీ మహేందర్, రాజసాగర్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం

గోదావరిఖని: సింగరేణిలో అతి పెద్ద ప్రమాదం కేవలం అధికారుల నిర్లక్ష్యంతో జరిగిందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ ఆరోపించారు. సోమవారం 7ఎల్ఈపీ గని ప్రమాదంలో అమరులైన 17 మందిని స్మరిస్తూ అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, సీఐటీయూ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఏఐటీయూసీ ఆర్జీ 2 సెక్రటరీ జిగురు రవీందర్, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ వికాస్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఘనంగా నిర్వహించాలని రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయం హాల్ పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి పలువురు యోగా శిక్షకులతో సమావేశం నిర్వహించారు.

సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పలు విషయాలపై సంక్షేమ అధికారులతో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. విరమణ పొందిన ఉద్యోగుల టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపు, పెన్షన్ సంబంధించిన సమస్యలు, ట్రాన్స్‌ఫర్, విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు సంబంధించిన కౌన్సిలింగ్ వివరాలు, హాజరు శాతం పెంచేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, సీఎంపీఎఫ్ నామినేషన్లు, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.

దేహదానాలకు వృద్ధ దంపతుల అంగీకారం



దంపతులను అభినందిస్తున్న సోమారపు సత్యనారాయణ

కోల్‌సిటీ: గోదావరిఖని శారదనగర్‌కు చెందిన మాజీ ప్రభుత్వ ఉద్యోగి లైశెట్టి రాజయ్య–మధురమ్మ వృద్ధ దంపతులు సోమవారం రాత్రి వినూత్నంగా వారి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. మరణానంతరం తమ ఇద్దరి దేహాలను మెడికల్ కళాశాలలకు దానం చేస్తామని అంగీకారాన్ని ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామగుండం మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ సంస్థ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ వృద్ధ దంపతులను అభినందించారు.

కాంగ్రెస్ రాజకీయాలకు భయపడేది లేదు



పుట్ట మధుతో బీఆర్ఎస్ నాయకులు

మంథని: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని, సర్కార్ కుట్రలు, బెదిరింపులకు భయపడేది లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ ఎదుట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్న నేపథ్యంలో ఆయనకు మద్దతుగా మంథని నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌కు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో, హామీల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ పార్టీ నాయకులను బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. నోటీసులు, విచారణల పేరుతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, ప్రతీ అంశాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయమని ఆయన స్పష్టం చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష పడ్డట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడిన తొమ్మిది మందిని సోమవారం సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ ఎదుట హాజరుపర్చగా.. వారికి రూ.14వేల వరకు జరిమానా విధించినట్లు చెప్పారు. రెండోసారి పట్టుబడ్డ ఉప్పుల నరేశ్, అసంపెల్లి నగేశ్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించగా.. వారిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

నర్సింగ్ ఆఫీసర్లపై వేధింపులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ సూపర్‌వైజర్ ఆస్పత్రిలోని నర్సింగ్ ఆఫీసర్లపై వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు నర్సింగ్ ఆఫీసర్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సదరు సూపర్‌వైజర్ ఆగడాలు రోజురోజుకు పెట్రోగిపోతున్నాయని, నర్సింగ్ ఆఫీసర్లను తన సెల్‌ఫోన్లలో ఫొటోలు తీస్తున్నాడని ఆరోపించారు.

పాఠశాలకు నోటీసులంటించిన అధికారులు

సుల్తానాబాద్: జిల్లాకేంద్రంలో గుర్తింపు లేని పాఠశాల నడిపిస్తున్నారని ఫిర్యాదు మేరకు విద్యాశాఖ అధికారులు పాఠశాలకు నోటీసులంటించారు. అనుమతి లేని పాఠశాలను నడిపించడంతో ఏబీవీపీ నాయకులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో గుర్తింపు లేని పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రవేశం తీసుకోవద్దని విద్యాశాఖ అధికారులు చెప్పారు. విద్యాశాఖ సిబ్బందిని విలేకరులు వివరణ కోరగా.. మాట్లాడకుండా వెళ్లిపోయారు. పాఠశాలకు సీజ్ చేయకుండా కేవలం నోటీసులంటించడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.